క్లుప్తంగా

దుళ్ల హైస్కూల్‌ను సందర్శించిన డీవైఈవో



ఉపాధ్యాయులు, నాయకులతో మాట్లాడుతున్న డీవైఈవో తిరుమలదాస్

కడియం: మండలంలోని దుళ్ల హైస్కూల్‌ను డీవైఈవో ఎం.తిరుమలదాస్ గురువారం సందర్శించారు. ఇటీవల ఈ స్కూల్లో సరస్వతీ దేవి విగ్రహంతో పాటు బెంచీలు తదితర వాటిని ఆకతాయిలు ధ్వంసం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డీవైఈవో స్కూల్‌ను సందర్శించి, స్థానిక పరిస్థితులపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. స్థానిక సమస్యలను హెచ్‌ఎం సుధ ఆయనకు వివరించారు. ఉపాధ్యాయులు సమష్టి కృషితో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఎంఈవో వి.లజపతిరాయ్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నూలు సోమేశ్వరరావు, గుంటూరి అబ్బులు, ఉపసర్పంచ్ తోకల శ్రీనివాస్, కంటిపూడి సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్ సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. ప్రీ పబ్లిక్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయుడు త్రినాథ్‌ను ఆదేశించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి అకడమిక్ అంశాలపై చర్చించారు. బైజూస్ ట్యాబ్ కంటెంట్‌పై సూచనలు చేశారు.

బియ్యం ప్యాకెట్ల వితరణ



బియ్యం పాకెట్లు అందజేస్తున్న జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు

కంబాలచెరువు: స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని చెవిటి మూగ పిల్లల ఆశ్రమ పాఠశాలకు జవహర్ వాకర్ క్లబ్ తరఫున గురువారం వితరణ చేశారు. ఆశ్రమానికి రూ 26,050 విలువైన 20 బస్తాల బియ్యం, 25 కేజీల కందిపప్పు, 15 కేజీల శెనగపప్పు అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు స్వప్నవర్మ మాట్లాడుతూ ఆశ్రమంలోని పిల్లలకు జవహర్ వాకర్ క్లబ్ చేస్తున్న సహాయాన్ని మరువలేమని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జవహర్ వాకర్ క్లబ్ అధ్యక్షుడు అక్కెన సత్యనారాయణ, సెక్రటరీ మూర్తి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, జాలి వాకర్ భాను పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం



షాపు నుంచి వెలువడుతున్న పొగ

కంబాలచెరువు: నల్లమందు సందులోని శోభ హోం అప్లయెన్సెస్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఇక్కడ గ్యాస్‌స్టవ్‌లు, ఇతర సామగ్రి అమ్మకాలు చేస్తుంటారు. ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న ఈ ఘటనలో దుకాణంలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సంఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు. సుమారు రూ.10 లక్షలు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

సాక్షి - సినిమాలు



శ్యామల :	బలగం
సూర్యమినీ :	స్క్రీమ్
సూర్యప్యాలెస్ :	తూజూటీమైమకలిర్
స్వామి :	వాల్తేరువీరయ్య
శివజ్యోతి :	దోచేవారెవరురా
అనుశ్రీ :	జంతుప్రపంచం
రాజా :	జంతుప్రపంచం
అశోక :	సార్
ఊర్వశి :	సీఎస్ఐసనాతన్
రంభ :	ఆర్‌ఆర్‌ఆర్
మేనక :	పులి
గీతాఅప్సర :	వినరోభాగ్యమువిష్ణుకథ
నామవరం	
వీఎస్ మహల్ :	జంతుప్రపంచం
మురళీకృష్ణ :	సార్

బ్లేడ్‌బ్యాచ్ దాడులు కేవలం పుకార్లే

- వాటిని నమ్మి భయపడొద్దు
- గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఎంపీ భరత్‌రామ్



గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: బ్లేడ్‌బ్యాచ్ దాడి ఘటనలు కేవలం పుకార్లేనని, వాటిని నమ్మి భయపడవద్దని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 45వ డివిజన్ ఆర్‌అండ్‌బీ వాంబే కాలనీలో ఆయన గురువారం గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ బ్లేడ్‌బ్యాచ్ దాడులంటూ వస్తున్న వార్తలను చూసి భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎంపీ భరత్‌రామ్ బ్లేడ్‌బ్యాచ్ దాడులపై అక్కడే ఉన్న త్రీటౌన్ సీఐ మధుబాబు, ఎస్సై శ్యాంసుందర్‌ను ఆరా తీశారు. ఇవన్నీ ఫేక్ అని విచారణ తేలిందని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. ఒక కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగి కలెక్షన్ చేసిన సొమ్మును వాడేసుకుని, బ్లేడ్‌బ్యాచ్ దాడిచేసి లాగేసుకున్నట్టు కంపెనీ యాజమాన్యాన్ని నమ్మించడానికి చేసిన ప్రయత్నమన్నారు. ఎంపీ మాట్లాడుతూ రాత్రివేళ పోలీసు గస్తీ పెంచడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ధైర్యం చెప్పాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగినా, స్థానికేతరులు రాత్రివేళ కనిపించినా వెంటనే వారిని గుర్తించి వివరాలు సేకరించాలన్నారు. అనుమానితులుగా అనిపించినా, దాడులు, ఘర్షణలు జరిగినా వెంటనే 100 కాల్ చేస్తే క్షణాల్లో పోలీసులు వస్తారన్నారు. ప్రస్తుత ఎస్పీ వచ్చిన తరువాత ఇటువంటి అలజడులకు బాధ్యులైన 66 మందిని గుర్తించి అరెస్టు చేశారన్నారు. వారంతా సెంట్రల్ జైల్లో ఉన్నారని ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక శక్తులను వదిలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, 45వ డివిజన్ ఇన్‌చార్జి కస్సె రాజేష్, రాష్ట్ర బీజీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, ఎంహెచ్‌ఓ వినూత్న, ఈఈ కనకారావు, ఏఈ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుడిపూడికి నివాళి

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ మాజీ సర్పంచ్ కుడిపూడి సత్యనారాయణకు గురువారం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల మృతిచెందిన గెద్దం వరలక్ష్మి, ఎం.పాపాయమ్మ కుటుంబ సభ్యులను ఎంపీ భరత్ రామ్ పరామర్శించారు. పార్టీ నాయకులు పాలిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అతడే నిందితుడు

- బ్లేడ్‌బ్యాచ్ దాడి ఘటన అవాస్తవం
- వివరాలు వెల్లడించిన పోలీసులు

కంబాలచెరువు: తనపై బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు దాడి చేసి, రూ.30 వేలు అపహరించుకుపోయారని పోలీసులను, మీడియాను తప్పుదోవ పట్టించిన వ్యక్తిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఇందిరానగర్ డంపింగ్ యార్డు వద్ద మంగళవారం రాత్రి పువ్వల పవన్‌కుమార్‌పై బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు దాడి చేసి సొమ్ములు ఎత్తుకుపోయారంటూ వార్తలు హల్‌చల్ చేశాయి. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వివరాలను దిశ పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ క్రైం జి.వెంకటేశ్వరరావు వెల్లడించారు. పప్పులవీధిలోని వీరభద్ర మెడికల్ ఏజెన్సీలో పనిచేసే పవన్ కుమార్ మెడికల్ షాపుల వద్ద బాకీలు వసూలు చేసే పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో కొంతసొమ్ము సొంతానికి వాడుకుని, అక్కౌంట్స్ బుక్‌లో అవకతవలకు పాల్పడ్డాడు. దీనిలో భాగంగా గోకవరం వెళ్లి బాకీలు వసూలు చేసుకొచ్చాడు. తనకు తాను బ్లేడ్‌తో గాయపర్చుకుని రూ.30 వేలు బ్లేడ్ బ్యాచ్ ఎత్తుకెళ్లిపోయిందని యజమాని రామన్ అప్పన్ మణికంఠకు తెలిపాడు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు అసలు నిజం బయటపెట్టారు. సమావేశంలో డీఎస్పీ సంతోష్, త్రీటౌన్ సీఐ మధుబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ క్రైం వెంకటేశ్వరరావు

మర్యాదపూర్వకంగా..



ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీజీ అండ్ బీసీ) చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గురువారం వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేసి శాలువాతో ఎంపీని సత్కరించారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

కంబాలచెరువు: స్థానిక పంతం సత్యనారాయణ మున్సిపల్ స్కూలు విద్యార్థులకు గోదావరి ముచ్చట్లు ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. గోపీకృష్ణ టూర్స్ అండ్ ట్రావెల్స్ సీఈవో సాయి శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ బి.చైతన్య కుమార్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

శాస్త్రోక్తంగా ముసలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనలో భాగంగా పూజలు చేస్తున్న దంపతులు



అమ్మవారిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆలయంలో ప్రత్యేక పూజలు

కడియం: కడియపులంక గ్రామదేవత పుంతలో ముసలమ్మ ఆలయంలో అమ్మవారు, విద్యాలక్ష్మీ గణపతి, జ్ఞాన సరస్వతి, పోతురాజుస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆస్థాన శిల్పి, ఆగమ సిద్ధాంతి కురుగంటి షణ్ముఖ శాస్త్రి పర్యవేక్షణలో వేద పండితుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఉదయం ఐదు గంటలకు ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా ఈనెల రెండో తేదీ నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే శుక్రవారం 108 కలశాలతో సప్తనదీ జలాలతో ఘటాభిషేకం జరుగుతుందని, లలితా సహస్ర పారాయణ, పంచ మంగళ హారతుల కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది. కాగా.. అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, తహసీల్దార్ ఎం.సుజాత తదితరులు దర్శించుకున్నారు.



ముసలమ్మ అమ్మవారి విగ్రహం

సాయి నామమే దివ్య ఔషధం

సీటీఆర్ఐ: మనసారా సాయినాథుని ధ్యానిస్తే, అదే దివ్య ఔషధమని సాయిసేవకులు పొక్కులూరి రామమూర్తి అన్నారు. మెయిన్ రోడ్డులోని వెంకటేశ్వర ఫైనాన్స్ ప్రాంగణాన్ని అనుకుని ఉన్న షిరిడీ సాయి మందిరంలో అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు నిర్వహణలో జరుగుతున్న 11వ వార్షిక త్రిదిన మహోత్సవాలలో భాగంగా రెండోరోజు ప్రవచనం నిర్వహించారు. ఉదయం సాయిబాబాకు విశేష అభిషేకాలు, పుష్పాభిషేకం, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. యనమండ్ర లలితా సరస్వతి వీణ కచేరీ అలరించింది. తల్లాప్రగడ చైతన్య మదంగంపై, శ్రీచరణ్ ఘటంపై సహకరించారు. కళాకారులను అద్దంకి వెంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి, ప్రముఖ వీణ విద్వాంసులు అయ్యగారి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: 2024 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు పిలుపు నిచ్చారు. గురువారం జిల్లాలో 30 మండలాలకు సంబంధించిన అధ్యక్ష, ఇన్‌చార్జులకు నగర బీజేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అవసరమైతే ఉద్యమాలకు వెనుకంజ వేయకుండా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, ప్రవాస యోజన జిల్లా కన్వీనర్ కురగంటి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిక్కి నాగేంద్ర పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ



కేక్ కట్ చేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు

- కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్
- ఆనం కళాకేంద్రంలో మహిళా దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండడమే కాకుండా కుటుంబ, ఉద్యోగ బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తున్నారని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ జగనన్న మహిళలకు సముచిత స్థానం కల్పించి, వారి పేరునే ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఉత్సాహంగా క్రీడలు, ఉద్యోగాల్లో అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య ప్రెసిడెంట్లు కె.భవాని, ఏ.సావిత్రి, ఎస్.సరస్వతి, కె.వరలక్ష్మి, కార్పొరేషన్ మహిళలను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మెప్మా పీడీ ప్రియంవద, అడిషనల్ కమిషనర్ పి.సత్యవేణి, ఎంహెచ్‌ఓ వినూత్న, రుడా సెక్రటరీ పి.శైలజ వల్లీ, డిప్యూటీ కమిషనర్ ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన

ఆరోగ్యకేంద్రంలో రొట్టెలు, పండ్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ తండ్రి, మాజీ ఎమ్మెల్యే చందన రమేష్ జన్మదిన వేడుకలు గురువారం బొమ్మూరులో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు సూర్యభగవాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహారోగి ఆరోగ్యకేంద్రంలోని రోగులకు పార్టీ నాయకురాలు ఎలుగొండ లక్ష్మి సౌజన్యంతో ఆమె, యెనుముల త్యాగరాజుల చేతుల మీదుగా రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, మాజీ ఉపసర్పంచ్ దాకే శ్రీనివాస్, సోమన శ్రీనివాస్, యర్రా కృష్ణయ్య, బన్ను పాల్గొన్నారు.



వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఏప్రిల్ 16 నుంచి ఐఎఫ్‌టీయూ మహాసభలు

ప్రకాశం నగర్: తిరుపతిలో ఏప్రిల్ 16,17,18 తేదీల్లో జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక అంబేడ్కర్ మెమోరియల్ లైబ్రరీ హాల్లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తర్వాత కార్మిక వర్గంపై దాడి తీవ్రతరమైందన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారన్నారు. ఇవి అమల్లోకి వస్తే కార్మిక వర్గం తమ హక్కులను, సౌకర్యాలను కోల్పోతుందన్నారు. సమావేశంలో కోరాడ అప్పారావు, నందమూరి దుర్గరావు, డి. శ్రీనివాసరావు, పోసియ్య పాల్గొన్నారు.

ఆవు - పులి - కథ చిత్రం షూటింగ్



జేగురుపాడులో సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కడియం: మండలంలోని జేగురుపాడులో 'ఆవు-పులి-కథ' సినిమా షూటింగ్ గురువారం ప్రారంభమైంది. స్థానిక ఎంపీటీసీ నాగిరెడ్డి సూర్యరామకృష్ణ కుమారుడు హర్షసాయి పవన్ హీరోగా, ప్రముఖ దర్శకులు భరత్ పారేపల్లి దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి క్లాప్‌కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. జేగురుపాడు మాజీ ఉపసర్పంచ్ గారపాటి అమర్‌నాథ్ కెమేరా స్విచ్‌ఆన్ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో షూటింగ్ చేసేందుకు షెడ్యూల్ రూపొందించామని చిత్రబృందం తెలిపింది. ముహూర్తం షాట్‌ను గ్రామంలోని జనార్దనస్వామి ఆలయంలో పూజలు చేసి చిత్రీకరించారు. శ్రావణి, కీర్తన హీరోయిన్లుగా నటిస్తున్నారు. సర్వసాయిమిత్ర మూవీస్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు నిర్మాతగా మోహన్ వల్లూరి, కెమెరామెన్‌గా వాసు వర్మ, మ్యూజిక్ డైరెక్టర్‌గా విజయ్.కె వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో గారపాటి అశోక్, పాతూరి రాజేష్, పంతం గణపతి, గట్టి నరసయ్య, ఆకుల సుధాకర్, ముద్రగడ జెమి, ఆదిమూలం సాయిబాబా, కర్రి చినబాబు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

రాజమహేంద్రవరం రూరల్: కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హుకుంపేట జాతీయ రహదారి నుంచి తూర్పురైల్వేస్టేషన్ రోడ్డులోని కల్వర్టు పరిస్థితి ఇది. ఎస్‌టీ ప్లాంట్ నుంచి శుద్ధిచేసిన నీరు హుకుంపేట మీదుగా బొమ్మూరు బాలాజీపేట నుంచి ధవళేశ్వరం సాయిబాబాగుడి వద్ద గోదావరిలో కలుస్తుంది. హుకుంపేట జాతీయ రహదారి నుంచి తూర్పురైల్వేస్టేషన్ రోడ్డులో ఆవ కాలువ మీద కల్వర్టు ఉంది. అయితే ఈ కల్వర్టు రక్షణ గోడలు పూర్తిగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో పట్టపగలే కారు ఈ కాలువలోకి దూసుకుపోయింది. ఈ నేపథ్యంలో బొమ్మూరు, ట్రాఫిక్ పోలీసులు సెంటర్ డివైడర్ రాళ్లను తీసుకుని వచ్చి రక్షణ గోడలుగా ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ప్రమాదాలకు కారణమవుతున్న కల్వర్టును పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టాలని హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు స్పందనలో సైతం ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు సైతం కల్వర్టును పరిశీలించి నూతన కట్టడానికి అంచనాలు తయారు చేసి కలెక్టర్‌కు నివేదించారు. ప్రస్తుతం కల్వర్టు ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కల్వర్టుకు ఒకవైపు రోడ్డు మార్జిన్ సైతం దిగిపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు.



హుకుంపేట ఆవ కాలువపై ఉన్న కల్వర్టు దుస్థితి

వైద్య చికిత్సకు సాయం అందించండి

- ఎంపీ భరత్‌రామ్‌ను కోరిన మహిళ
- 46వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజమహేంద్రవరం సిటీ: తన వైద్యానికి ఆరోగ్యశ్రీ కార్డు పనిచేయదంటున్నారని, సహాయం అందించి కాపాడాలంటూ మహిళ గురువారం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కోరింది. నగరంలోని 46వ డివిజన్ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుతం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్ నగర్ టీచర్స్ కాలనీలో ఎంపీ భరత్‌రామ్ పర్యటించారు. అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఓ మహిళ మహిళ తన వైద్యం కోసం ఎంపీ వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన ఎంపీ ప్రైవేటు ఆసుపత్రి నిర్వాహకుడైన డాక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలియజేశారు. మెడికల్ రిపోర్టులు తీసుకుని, శుక్రవారం ఉదయం ఆసుపత్రికి వెళ్లి కలవాలని, వైద్యం అందిస్తారని భరోసా ఇచ్చారు. కుళాయిలు, డ్రైనేజీలు తదితర సమస్యలు ఎంపీ దృష్టికి రాగా.. వాటిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

25 కిలోల గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: నర్సీపట్నం ఏజెన్సీ నుంచి గంజాయిని కొనుగోలు చేసి రాజస్థాన్ తరలిస్తున్న ఐదుగురిని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయకుమార్ అరెస్టు చేశారు. వారి నుంచి 25 కిలోల గంజాయి, కారు, రూ.1600, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్‌కు అందిన సమాచారం మేరకు గురువారం దివాన్ చెరువు జీరోపాయింట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీసులను చూసి, ఓ ఐదుగురు తమ కారును వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేయగా 25 కిలోల గంజాయి దొరికింది. రాజస్థాన్‌కు చెందిన ఉత్తకుచౌదరి, ధాహియాలాఖ్‌సింగ్, ప్రతాప్‌సింగ్, గొరవ్‌రాం, లలిత్‌పటేల్ నర్సీపట్నం ఏజెన్సీలో ఈ గంజాయిని కొనుగోలు చేసి రాజస్థాన్‌కు తరలిస్తున్నారు.